క్లుప్తంగా

'గడప గడపకు..' విజయవంతానికి పూజలు



వినాయకుని గుడిలో పంచాయతీ పాలకవర్గం పూజలు

కొడవలూరు : స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నిర్వహిస్తున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసుకోవాలని కోరుతూ తలమంచి వినాయకుని గుడిలో పంచాయతీ పాలకవర్గం బుధవారం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్‌లు యాటగిరి భాస్కర్‌రావు, ఆత్మకూరు వెంకట సతీష్, వైఎస్సార్‌సీపీ నేతలు కె.వెంకయ్య, ఆర్.వేణుగోపాల్, వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



సన్మానం అందుకున్న పూర్వ విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : విడవలూరులో ఉన్న పీఆర్‌ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం జరిగింది. కళాశాల ప్రారంభించిన తరువాత 1965–68వ సంవత్సరంలో మొదటి బ్యాచ్‌గా డిగ్రీ చేసిన పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం కళాశాల ఏర్పాటుకు స్థలాన్ని దానం చేసిన పొన్నలూరు రామచంద్రారెడ్డి, వెంకటసుబ్బమ్మ విగ్రహాలను కళాశాల ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ కళాశాల ఏర్పాటుకు స్థలాన్ని దానం చేసి ఎంతో మంది పేద విద్యార్థులకు విద్యను అందించిన మహానుభావుల విగ్రహాలను ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుబ్రహ్మణ్యం, కృష్ణయ్య, బోయిరెడ్డి, సుజాత, సూర్యనారాయణ, ప్రస్తుత అధ్యాపకులు పాల్గొన్నారు.

నేత్రదానం



నేత్రదానం చేసిన రాజ్యలక్ష్మి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : విడవలూరుకు చెందిన నేలబొట్ల రాజ్యలక్ష్మి (82) అనే వృద్ధురాలి నేత్రాలను ఆమె కుటుంబసభ్యులు బుధవారం మనసేవా సంస్థ ఆధ్వర్యంలో దానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ అనారోగ్యంతో రాజ్యలక్ష్మి మృతి చెందగా, ఆమె చివరి కోరిక మేరకు కుటుంబసభ్యులు నేత్రదానం చేశారన్నారు. ఈ నేత్రాలను నెల్లూరుకు చెందిన ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి టెక్నీషియన్లు లాలేష్, బాలాజీ స్వీకరించారు.

ఐదుగురు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు డిబార్ అయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్‌లో 1,218 మంది విద్యార్థులకు 118 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నేతాజీ డిగ్రీ కళాశాలల్లో ఒక్కో విద్యార్థి డిబార్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన మూడో సెమిస్టర్‌లో 11,290 మంది విద్యార్థులకు 916 మంది గైర్హాజరయ్యారని, కోవూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థి డిబార్ అయ్యారని తెలిపారు.

పురుగు మందు తాగిన యువకుడు

• చికిత్స పొందుతూ మృతి



సురేష్ మృతదేహం

పొదలకూరు : కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై ఎస్‌కే కరిముల్లా కథనం మేరకు.. మండలంలోని ఇనుకుర్తి గ్రామానికి చెందిన దేవరాయపల్లి సురేష్(26) చేజర్ల మండలం కలాయపాళెం గ్రామానికి చెందిన మంజులను ఏడేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. మద్యానికి బానిసైన సురేష్ తరచుగా భార్యతో గొడవ పడేవాడు. దీంతో విసిగిపోయిన భార్య నాలుగు మాసాల క్రితం పుట్టింటికి వెళ్లారు. తన భార్య తిరిగి తన వద్దకు రాలేదని తీవ్ర మనస్తాపానికి గురై ఈనెల 21న మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగాడు. కుటుంబసభ్యులు గుర్తించి ముందుగా పొదలకూరు సీహెచ్‌సీలో చికిత్స చేయించి తర్వాత నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందారు. దీంతో మృతుడి తల్లి సుబ్బమ్మ బుధవారం పొదలకూరు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితం

• తమ హయాంలోనే రోడ్లకు నిధులు
• రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



దుగ్గుంటరాజుపాళెంలో వృద్ధుడికి సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కాకాణి

పొదలకూరు : తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధి పనులకు శిలాఫలకాలను వేస్తే తమ ప్రభుత్వం నిధులు విడుదల చేసి గ్రామాలకు రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దుగ్గుంట సచివాలయ పరిధిలో పెదరాజుపాళెం, పక్కిమడ గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంత్రి కాకాణి బుధవారం నిర్వహించారు. ముందుగా పెదరాజుపాళెంలో రూ.2.06 కోట్లతో సిమెంటురోడ్లు, సైడ్‌డ్రెయిన్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలకు అవసరమైన మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత రైతాంగం గతంలో సాగునీటికి ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు పూర్తిస్థాయిలో సాగునీటిని అందిస్తున్నట్లు చెప్పారు. అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తూనే పర్యవేక్షిస్తున్నందున మూడేళ్లుగా రైతులు సాగునీటిని వినియోగించుకుంటూ పంటలు పండించుకుంటున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి వల్లే బ్రహ్మరథం

మెట్ట ప్రాంత గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయబట్టే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నట్లు మంత్రి కాకాణి వెల్లడించారు. టీడీపీ కంచుకోట లాంటి గ్రామాల్లో కూడా వైఎస్సార్‌సీపీకి ఆదరణ లభిస్తున్నట్లు వెల్లడించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి తాము ప్రజలను నేరుగా వెళ్లి కలుసుకునే గొప్ప అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఇంటింటికి వెళ్లడం వల్ల సంక్షేమ పథకాల అమలు తీరు తెలుసుకోగలుగుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో పాటు మండల సచివాలయాల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు కోనం చినబ్రహ్మయ్య, పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కేతు రామిరెడ్డి, సర్పంచ్ వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలవి తప్పుడు ప్రచారం



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రసన్న

• మన పథకాలు దేశానికే ఆదర్శం
• ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలును చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పడుగుపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రసన్న బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం రూ.45 లక్షలతో నిర్మించిన పడుగుపాడు–3 సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. గ్రామంలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.

పలువురికి ఆర్థిక సాయం

పడుగుపాడు–2 సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్న సల్మా భర్త ఇటీవల మరణించడంతో వారి ఇద్దరు బిడ్డలను నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.20 వేలు చొప్పున రూ.40 వేలను పడుగుపాడు సొసైటీ బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. అలాగే తల్లి దండ్రిని కోల్పోయిన కోవూరు సాల్మన్‌కు రూ.25 వేలు, కేన్సర్‌తో బాధపడుతున్న మహిళకు రూ.25 వేలు, పడుగుపాడు దళితవాడకు చెందిన మైలారి శ్యామ్ అనే చిన్నారి తలసేమియాతో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల కోసం రూ.25 వేలు, మరో వలంటీర్ ఇంటి నిర్మాణం కోసం రూ.20 వేలను ట్రస్టు ద్వారా అందజేశారు. అలాగే ఐదుగురికి కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఉపసర్పంచ్ ఎస్కే.అహమ్మద్, భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ప్రమీల, బాబురావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మూలమూర్తుల శోభాయాత్ర



పట్టణంలో సాగుతున్న మూలమూర్తుల ఊరేగింపు

పొదలకూరు : పట్టణంలోని అయ్యప్పనగర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా మూడో రోజు బుధవారం మూలమూర్తుల శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి, గోదాదేవి, లక్ష్మీదేవి మూలమూర్తుల విగ్రహాలు, ద్వారపాలకులైన జయ, విజయుల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ట జరిగింది. దేవస్థానం నుంచి రామమందిరం మీదుగా సంగంరోడ్డు సెంటర్ వరకు శోభాయాత్రను నిర్వహించారు. యాత్రలో కాళికామాత బృందం చేసిన నృత్యాలు, కోలాటం, డ్రమ్స్, ఒంటెల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు పెద్ద ఎత్తున శోభాయాత్రలో పాల్గొని శ్రీమన్నారాయణ నామస్మరణ చేశారు. సాయంత్రం దేవస్థానంలో సర్వదేవతా హోమాలు, టీటీడీ వారిచే హరికథా కాలక్షేపం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ యాత్రలో దేవస్థానం చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి, అల్లూరు రమణయ్యస్వామి, అర్చకుడు శ్రీనివాసాచార్యులు, శివకుమార్, కమిటీ సభ్యులు మోహన్, కండే వాసుదేవరావు, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వెంకటాచలానికి మంత్రి కాకాణి రాక

వెంకటాచలం : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం వెంకటాచలంలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారన్నారు.

కారును ఢీకొన్న లారీ

• ట్రాఫిక్‌కు అంతరాయం



హైవేపై ఆగిన వాహనాలు

మనుబోలు : మండల పరిధిలోని జాతీయ రహదారిపై బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద బుధవారం కారును లారీ ఢీకొన్న ప్రమాదంలో కారు దెబ్బతింది. అయితే ఎవరికీ పెద్ద గాయాలు కాలేదు. బద్దెవోలు క్రాస్‌రోడ్డు సమీపంలో ఓ వైపు హైవే విస్తరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్‌ను ఒకేవైపు అనుమతిస్తున్నారు. ఈ క్రమంలో గూడూరు నుంచి నెల్లూరు వైపు వస్తున్న కారును అదే మార్గంలో వస్తున్న లారీ ఢీకొంది. దీంతో భారీగా వాహనాలు ఆగిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు రంగప్రవేశం చేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

సద్గురు బోధనలు ఆచరణీయం

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



బాబా పూజల్లో పాల్గొన్న మంత్రి కాకాణి

ముత్తుకూరు : సద్గురు సాయిబాబా బోధనలు సర్వదా ఆచరణీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వల్లూరులో రూ.60 లక్షలతో నిర్మించిన శివసాయిబాబా మందిరాన్ని బుధవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు ఆచరించారు. భక్తుల అభిరుచి, ఆలోచనలకు అనుగుణంగా మందిరాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించిన నిర్వాహకులు వల్లూరు మోహనరావు–హైమావతమ్మ దంపతులను మంత్రి అభినందించారు. అధిక వ్యయ ప్రయాసలకోర్చి ఆలయ నిర్మాణం పూర్తి చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈనెల 27వ తేదీన విగ్రహ ప్రతిష్ట జరుగుతున్న నేపథ్యంలో మంత్రి ఆలయాన్ని సందర్శించారు. తొలుత ఆలయ అర్చకులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ పెంచల ప్రతాప్, నాయకులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, పోచారెడ్డి చెంగారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్కినేనిని కించపరిస్తే సహించేదిలేదు

కోవూరు : మా ఆరాధ్య నటుడు అక్కినేని నాగేశ్వరరావును కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆయన అభిమాని చింతా గోపాలకృష్ణ అన్నారు. కోవూరులో ఆయన బుధవారం మాట్లాడుతూ ఇటీవల నందమూరి బాలకృష్ణ తన సినిమా విజయోత్సవ సభలో అక్కినేని.. తొక్కినేని అంటూ కించపరిచేలా మాట్లాడాడని, ఇప్పటికైనా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మహిళా రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఎంపిక



మాట్లాడుతున్న ఏపీఎం రుక్మిణి

కొడవలూరు : స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏపీఎం ఎస్.రుక్మిణి అధ్యక్షతన మండల మహిళా రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యను బుధవారం ఎంపిక చేశారు. మండలంలో 151 సంఘాలకు గానూ 1,746 మంది సభ్యులుండగా వీరిలో ఐదుగురు పదాధికారులు, పది మంది కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులుగా పి.సుజనమ్మ, ఎస్కే.ఇర్ఫాన్, కోశాధికారి, ఉపాధ్యక్షులుగా జి.శారద, డి.వాణి, సంయుక్త కార్యదర్శిగా ఎన్.దొరసాని ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి ఏపీఎం రుక్మిణి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పథకాలను రైతు సంఘాలు సద్వినియోగం చేసుకునేలా మండల సమాఖ్య కృషి చేయాలన్నారు. సమావేశంలో అకౌంటెంట్ ఎన్.అమలమ్మ, సీసీలు సీహెచ్.సుకన్య, కె.ఉదయ్‌కుమార్, శ్రీదేవి, మమత, శోభ, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చేనేతలకు సముచిత స్థానం

• ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

పొదలకూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేనేతలకు సముచిత స్థానం దక్కుతోందని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు వూకోటి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. పొదలకూరులో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళగిరికి చెందిన టీడీపీ సీనియర్ నేత, చేనేత వర్గాలకు చెందిన గంజి చిరంజీవికి చంద్రబాబు గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ నిరాకరించినట్లు గుర్తుచేశారు. అయితే ఆయన వైఎస్సార్‌సీపీలో చేరిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆప్కో చైర్మన్‌గా పదవిని ఇచ్చి కేబినెట్ హోదా కల్పించారన్నారు. ఈ ప్రభుత్వంలో అన్నివర్గాలకు న్యాయం జరుగుతోందన్నారు. ఐక్యవేదిక నియోజకవర్గ కన్వీనర్ పముజుల శంకరయ్య, మండలాధ్యక్షుడు సోమా భాస్కర్, ఉపాధ్యక్షుడు మాడా రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి చొప్పా వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ బి.మురళీ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు) : రక్తదానం ప్రాణదానంతో సమానమని విడవలూరు రెడ్‌క్రాస్ ఉప కేంద్ర నిర్వాహకుడు బొమ్మిశెట్టి శ్రీనివాసులు అన్నారు. విడవలూరులోని పీఆర్‌ఆర్ అండ్ వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో విద్యార్థులతో పాటు స్థానికులు సుమారు 62 మంది రక్తదానం చేశారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుజాత, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కు అమూల్యం

• వీఎస్‌యూ వీసీ సుందరవల్లి
• ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



వెంకటాచలం : మాట్లాడుతున్న వీఎస్‌యూ వీసీ సుందరవల్లి



కొడవలూరు: బ్యాలెట్‌లో ఓటు వేస్తున్న విద్యార్థిని

వెంకటాచలం : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో అమూల్యమైనదని, ఆ విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వీసీ జీఎం సుందరవల్లి పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరులో ఉన్న వీఎస్‌యూలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ సుందరవల్లి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాధాన్యం ఉందని చెప్పారు. తహసీల్దార్ కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సాంకేతికత, నూతన పద్ధతులను ప్రవేశపెట్టి మెరుగైన ఎన్నికల ప్రక్రియను భారత ఎన్నికల కమిషన్ వినియోగిస్తూ ప్రపంచ మన్ననలు పొందినట్లు పేర్కొన్నారు. సదస్సులో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, సునీత, విద్యాప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి

పొదలకూరు : ఓటు విలువ తెలుసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని తహసీల్దార్ ఐఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ సిటిజన్లను తహసీల్దార్ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత స్వచ్ఛందంగా ఓటు హక్కు పొందాలన్నారు. వీఆర్వోలు పేరయ్య, అమరావతి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

• **కోవూరు** : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని తహసీల్దార్ పద్మజ, డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను సన్మానించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఓటుకు ఆధార్ సీడింగ్‌ను 92 శాతం పూర్తి చేసిన బీఎల్వో నీరజను అధికారులు అభినందించారు. సర్పంచ్ యాకసిరి విజయ, ఆర్ఐ రమణయ్య, సీనియర్ సహాయకుడు మధుసూదన్‌రావు, వీఆర్వో ప్రసాద్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి శివరాం ఉన్నారు.

• **తోటపల్లిగూడూరు** : వరిగొండ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓటు హక్కు ఆవశ్యకతపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల గణాంకాధికారి రామ్‌ప్రసాద్ మాట్లాడారు. అనంతరం సీనియర్ ఓటర్లను సత్కరించారు. హెచ్ఎం వెంకట రాధాకృష్ణ, వీఆర్వో మహేష్, బీఎల్ఓలు కుందన, శ్రీనివాస్, అన్నపూర్ణ, తులసి పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

బుచ్చిరెడ్డిపాళెం : ఓటు హక్కు వజ్రాయుధమని మండల విద్యాశాఖాధికారి దిలీప్ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. హెచ్ఎం సుజాత ఉన్నారు.

• మండలంలోని సాల్మన్‌పురంలో ప్రపంచ మానవ హక్కుల సంఘం ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘ చైర్మన్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

విడవలూరులో

మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. అలాగే ఫారం 6, 7, 8 పై డిప్యూటీ తహసీల్దార్ భానుప్రకాశ్ అవగాహన కల్పించారు.

• **ఇందుకూరుపేట** : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సుబ్బయ్య ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం సీనియర్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో డీటీ బషీర్, సిబ్బంది పాల్గొన్నారు.

• మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కల్పన ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవం జరిగింది. అనంతరం ఉపాధి హామీ పథకం సిబ్బందిచే ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈఓపీఆర్డీ వసుంధర పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మాక్ పోలింగ్

కొడవలూరు : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నార్తురాజుపాళెం హైస్కూల్‌లో విద్యార్థులు బుధవారం నిర్వహించిన మాక్ పోలింగ్ ఆకట్టుకొంది. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్‌లు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల నమూనాలను విద్యార్థులే స్వయంగా రూపొందించి ఓట్లు వేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం డి.ఓబులేశు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలనే ఉద్దేశంతో మాక్ పోలింగ్‌ను నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయులు వై.చిట్టిబాబు, డి.శ్రీలక్ష్మి, ఎస్కే.రఫీ అహ్మద్, కె.సురేంద్ర, ఎస్.స్వర్ణలత పాల్గొన్నారు.

• కొడవలూరు పంచాయతీ కార్యాలయంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, వీఆర్వో జి.రఘురామయ్య పాల్గొన్నారు.

• నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ పి.కుమార్‌బాబు ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవం జరిగింది. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. కళాశాల చైర్మన్ పెనుబల్లి బాబునాయుడు, డైరెక్టర్ పి.కృష్ణ చైతన్య, ఎన్ఎస్ఎస్ అధికారి టి.సుబ్రహ్మణ్యం, హెచ్ఓడీ పీఎస్ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం : ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పొదలకూరు : సీనియర్ ఓటర్‌కు సన్మానం



కోవూరు : సీనియర్ ఓటర్లకు సన్మానం



ఇందుకూరుపేట రెవెన్యూ కార్యాలయంలో..



తోటపల్లిగూడూరు : వరిగొండలో..



బుచ్చిరెడ్డిపాళెం : మానవ హక్కుల సంఘం ఆధ్వర్యంలో..

గ్రామపంచాయితీ కార్యాలయము – దామరమడుగు

ఆర్.ఓ.సి.నెం.01/2023 | తేది: 25-01-2023

[illegible] తేది 06-02-2023 సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు [illegible]

క్ర.సం.	టెండర్ వివరములు	టెండర్ ఫారమ్ ధర
1	PWS సామాన్ల [illegible]	1000/-
2	తేది 01-04-2023 నుండి 03-03-2024 వరకు గ్రామ పంచాయతీ [illegible]	1100/-

[illegible], పంచాయతీ కార్యదర్శి, దామరమడుగు గ్రామ పంచాయతీ

గ్రామ పంచాయితీ కార్యాలయము-రేబాల

బుచ్చిరెడ్డిపాళెం మండలము, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

ఆర్. ఓ. సి. నెం:06/2023 | టెండర్ ప్రకటన | తేది: 25-01-2023

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం, రేబాల గ్రామ పంచాయతీకి 2023-2024 సంవత్సరమునకు [illegible] 06.02.2023 సోమవారము ఉదయము 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు [illegible] 3.00 గంటలకు [illegible]

క్ర. సం.	టెండరు వివరములు	ధరావత్తు రూ.లలో
1	2023-2024 సంవత్సరమునకు [illegible]	రూ.200/-
2	2023-2024 సంవత్సరమునకు PWS [illegible]	రూ.200/-
3	2023-2024 సంవత్సరమునకు గ్రామ పంచాయతీ [illegible] LF Books & Forms [illegible]	రూ.200/-
4	2023-2024 సంవత్సరమునకు గ్రామ పంచాయతీ [illegible]	రూ.200/-
5	2023-2024 సంవత్సరమునకు గ్రామ పంచాయతీ [illegible] PWS [illegible]	రూ.200/-
6	2023-2024 సంవత్సరమునకు PWS [illegible]	రూ.200/-
7	తేది 01.04.2023 నుండి తేది 31.03.2024 వరకు [illegible]	రూ.5000/-

పంచాయితీ కార్యదర్శి, రేబాల గ్రామ పంచాయితీ.